క్లుప్తంగా

22న విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: రాబోవు వేసవిలో డిమాండ్‌కు తగిన విధంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు ఈ నెల 22వ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుతున్నట్లు కడప ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి సేవ్యానాయక్ ఎ ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద గల విద్యుత్ ఉప కేంద్రంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫర్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో కలెక్టరేట్, పరిసర ప్రాంతాలు, ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఎదురుగా ఉండే ప్రాంతాలు, ప్రకాష్ నగర్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

23న పుస్తక పరిచయ సభ

కడప ఎడ్యుకేషన్/ఖాజీపేట: వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం పిడబ్లూడి బంగ్లా వద్ద వెలసిన శివభక్తేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 23న ఉదయం పదిగంటలకు పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌జిల్లా రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కాప్పోలురెడ్డి శేఖర్‌రెడ్డి, మూల శివారెడ్డి తెలిపారు. సభకు మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. స్వామి భక్తుల తోపాటు ప్రజలు హాజరుకావాలని కోరారు.

రామాలయం పునర్నిర్మాణానికి కలిసిరండి

కడప కార్పొరేషన్: కడప నగరం మాసాపేట ప్రాంతంలో తొలగించిన రామాలయం పునర్నిర్మించేందుకు అందరూ ముందుకు రావాలని స్థానిక నాయకులు జీవన్ పిలుపునిచ్చారు. మాసాపేట వద్ద విలేకరులతో ఆయన మాటాల్డుతూ ఆలయాన్ని కూల్చిన సమయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి దేవతామూర్తుల విగ్రహాలను ప్రక్కన పెట్టడం జరిగిందన్నారు. దేవాలయ నిర్మాణానికి మేయర్ సురేష్‌బాబు 2023-24లో రూ.43 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయానికి సంబంధించిన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కొంతమంది వివాదాలు రేగేలా వ్యవహరించడం సరికాదని, ఆలయ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

దూదేకులు చైతన్యవంతులు కావాలి

కడప రూరల్: దూదేకులు సామాజిక ఆర్థిక, రాజకీయ రంగాల్లో చైతన్యవంతులు కావాలని దూదేకుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఖాదరయ్య తెలిపారు. స్థానిక దూదేకుల భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన దూదేకుల వర్గీయులు మిగిలిన సహచరులకు చేయూత నందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అయిల్ మిల్ ఓబులేసు, మహబూబ్‌బాషా, సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



అరుణమ్మను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

కడప కార్పొరేషన్: డాక్టరేట్ పొందిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి అరుణమ్మను పార్టీ మహిళా నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. ఆమె నివాసంలో గురువారం వారు కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 108, 104లో పరిశోధన చేసి డాక్టరేట్ పొందడం సాధారణ విషయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి, జ్యోతి, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలపై కక్ష్య సాధింపు చర్యలా?

కడప వైఎస్ఆర్ సర్కిల్: బద్వేల్ పట్టణంలోని రాత్రియులు గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ యంత్రాంగం కక్ష్యపూరితంగా వ్యవహరించడం అన్యాయమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగదాసరి ఇమ్మానుయేల్, కానగల మునెయ్య అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు పేదల గుడిసెలపై కబ్జాదారులు చేసే కుట్రలకు మద్దతిచ్చే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వంక, వాగు భూములను ఇష్టానుసారంగా కబ్జాచేస్తున్నా పట్టించుకోని అధికారులు పేదలపై ప్రతాపం చూపడం తగదన్నారు.

50 శాతం రాయితీ ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్: బీసీ కార్పొరేషన్ ద్వారా ఈబీసీలకు 50 శాతం రాయితీపై రుణాలివ్వాలని బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున ఓ ప్రకటనలో విమర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. తమకు బీసీలే వెన్నముక అంటూ కూటమి ప్రభుత్వం చెబుతూనే మరోవైపు అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. కనుక తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 50 శాతం రాయితీతో రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బౌద్ధారామాల జిల్లాకు.. సర్క్యూట్‌లో చోటేది?

కొత్త సర్కార్ పాత పాటే అందుకుంది. పర్యాటక అభివృద్ధిలో భాగంగా బుద్దిస్ట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తామని టీడీపీ ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ప్రాథమిక పరిశీలనలోకి తీసుకోకపోవడంపై బుద్దిస్ట్ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా ప్రాంతాల కంటే ఏమాత్రం తీసిపోనంత ఎక్కువ మంది బుద్దిస్టులు ఉన్న కడప జిల్లాలోబుద్దిస్ట్ సర్క్యూట్ ఏర్పాటుకు ఎందుకు మొగ్గు చూపలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- జైనులు,బౌద్ధులు, తదితర పర్యాటకుల డిమాండ్
- పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలోకి రాని జిల్లా



నందలూరు అడపూరు గుట్టపై గల బౌద్ధ స్థూపాలు



నాగనాదేశ్వరకోనలో వెలుగు చూసిన బుద్ధ పాదం


కడప కల్చరల్: రాష్ట్రంలో బౌద్ధారామాలను గుర్తించి.. వాటిని ఒక సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తే బుద్ధిడిని ఆరాధించే దేశస్తులను ఆకర్షించవచ్చని ఇటీవల కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. బౌద్ధం, జైనుల ఆలవాలంగా ఉన్న కడప జిల్లాకు బుద్ధ సర్క్యూట్‌లో చోటు లభిస్తుందని అందరూ ఆశపడ్డారు. మిగతా బౌద్ధ అవశేషాలు ఉన్న ప్రాంతాలతో పోలిస్తే జిల్లా ఏమాత్రం తీసిపోకపోవడమే ఇందుకు కారణం. అంతే గాక జైన కేంద్రాలు ఇక్కడ ఉండడం విశేషం. అయితే జిల్లాకు బుద్దిస్ట్ సర్క్యూట్‌లో చోటివ్వడం గురించి ప్రాథమిక పరిశీలనలో కూడా లేకపోవడంతో బుద్దిస్ట్ అభిమానులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని బౌద్ధ, జైన ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నా.. కూటమి ప్రభుత్వం ఆదిశగా ప్రతిపాదనలు చేయడం లేదు.

ఘనమైన కేంద్రాలు

రాష్ట్రంలో బుద్దిస్ట్ సర్క్యూట్ ఏర్పాటు గురించి పర్యాటక శాఖ పెద్దలు ప్రతి సమావేశంలోనూ ప్రస్తావిస్తున్నారు. అమరావతి, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలు మినహా కడప జిల్లా వారి దృష్టికి రావడంలేదు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని నందలూరు వద్ద గల అడపూరు గుట్టపై ప్రస్తుతం 13 బౌద్ధ స్థూపాలున్నాయి. రాజంపేట బస్టాండు వద్దగల కొండూరు తిప్పపై పలు బౌద్ధ స్థూపాలు, ఇతర నిర్మాణాల శిథిలాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి అత్యంత ప్రాచీనమైనవిగా ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి స్పష్టం చేశారు. క్రీస్తు పూర్వం రెండు నుంచి నాలుగు శతాబ్దం వరకు ఈ ప్రాంతంలో విలసిల్లినట్లు పురావస్తుశాఖ డైరెక్టర్ కేదారేశ్వరి ప్రత్యేకంగా పుస్తకం రచించారు. అడపూరు బౌద్ధారామాల చుట్టూ పలు పర్యాటక ప్రాంతాలున్నాయి. ఈ గుట్టపై వంద అడుగుల బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని పర్యాటకం సీతారామయ్య ఎంతో కృషి చేశారు. దీంతోపాటు ఖాజీపేట గుట్టపై నాగనాదేశ్వర క్షేత్రం వద్ద బౌద్ధ అవశేషాలు, నేల మాళిగ వెలుగు చూశాయి. ఇన్ని ప్రత్యేకతలున్నా ఇంతవరకూ ప్రభుత్వం జిల్లాను పరిగణలోకి తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జైనులకు ఆలవాలం

జిల్లాలో ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు వైపు 14 కిలోమీటర్ల దూరంలో దానవులపాడు ఉంది. ఇది ప్రముఖ జైన క్షేత్రంగా విరాజిల్లుతోంది. క్రీస్తు శకం ఆరో శతాబ్దంలో దీనికి జైన పీఠంగా గొప్ప పేరుండేదని తెలుస్తోంది. దీనికి కురుమరి అని పేరు ఉన్నట్లు జమ్మలమడుగు కైఫయత్తులో ఉంది. మిగతా నిర్మాణాలన్నీ నేల కరిచిపోగా ఒక్క మందిరం మాత్రం మిగిలి ఉంది. అందులో 23వ తీర్థంకరుడైన పార్శ్వ నాథుని విగ్రహం ఉంది. క్రీ.శ. 914-17 మధ్యన రాష్ట్రకూట ప్రభువు మూడవ నిత్య వర్షుని కాలంలో దానవులపాడు గొప్ప జైన పీఠంగా ఉండేది. జిల్లాలోని పెనికలపాడు, జాండ్లపాడు, గంగపేరూరు ప్రాంతాలలోనూ విలసిల్లినట్లు నేటికీ ఆధారాలున్నాయి. జైన మత కేంద్రాల్లో దానవులపాడు ప్రముఖమైనది. ప్రతి శివరాత్రి సందర్భంగా పక్షం రోజుల ముందునుంచి రాజస్థాన్ భక్తులు దానవులపాడును సందర్శించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో బౌద్ధం, జైనుల ప్రాధాన్యం గుర్తించి జిల్లాకు బుద్దిస్ట్ సర్క్యూట్‌లో చోటు కల్పించేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



దానవులపాడులోని పార్శ్వనాథుడి విగ్రహం

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: వ్యవసాయరంగంలో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు శాస్త్ర వేత్తలు, వ్యవసాయాధికారులు కృషి చేయాలని ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. కడప ఊటకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఏడీఏలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని వ్యవసాయ డివిజన్లకు సంబంధించి వ్యవసాయ, ఉద్యాన పంటలైన వరి, నువ్వు, వేరుశనగ, బొప్పాయి, మామిడి, అరటి పంటలకు ఆశించే చీడపీడల నివారణ చర్యలను వివరించారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్ మాట్లాడుతూ కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయి పర్యటన చేసి రైతులకు సూచనలు, సలహాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ విజయలక్ష్మి, చంద్రానాయక్ శాస్త్రవేత్తలు రమణా రెడ్డి, పీరూ సాహెబ్, ఫిరోజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

చోరీల నియంత్రణపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ ఓబులేసు

కడప అర్బన్: పట్టణం, పల్లెల్లో చోరీలను అరికట్టేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సీఐ ఓబులేసు అన్నారు. చిన్నచౌక్ పీఎస్ పరిధిలోని గురువారం సాయంత్రం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇంటికి తాళాలు వేసి వెళ్లేటపుడు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. బంగారు, వెండి తదితర విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచుకుంటే చోరీలకు ఆస్కారం వుండదన్నారు. మహిళలు, బహిరంగ ప్రదేశాలకు వెళ్లేటపుడు బంగారు ఆభరణాలు కనిపించకుండా చీర కొంగు కప్పుకోవాలని సూచించారు. ఇంటివద్ద సీసీకెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా పలు జాగ్రత్తలు సూచించారు.

నిత్యపూజ కోనకు బస్సులు నడపండి



వినతిపత్రం సమర్పిస్తున్న రామమహేష్

కడప కల్చరల్: జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం నిత్యపూజకోనకు బస్సులు నడపాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ రామమహేష్ కోరారు. ఏపీఎస్సార్టీసీ డిపో మేనేజర్‌ను గురువారం ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నిత్యపూజ కోనకు రోజూ కడప నుంచి బస్సులు నడపాలని కోరారు. శివరాత్రికి వేసే ప్రత్యేక సర్వీసుల్లో భక్తుల నుంచి టిక్కెట్ పేరిట అధిక ధరలు వసూలు చేయరాదని, కిలోమీటర్ల ప్రకారమే వసూలు చేయాలని కోరారు. మంచి కండీషన్‌గల బస్సులను మాత్రమే నడపాలని, బస్టాండు వద్ద మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇదే వినతులను కడప ఆర్టీఓ, తహసీల్దారు, పోలీసు అధికారులకు అందజేశారు.

బీజేపీలో మహిళలకు ఎంతో ప్రాధాన్యం



మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం మహిళలకు పెద్దపీట వేస్తోందని జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శోభాభాయి అన్నారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించి, 27 సంవత్సరాల తర్వాత అధికారాన్ని చేజిక్కించుకున్న విషయం విదితమేనన్నారు. భారత రాష్ట్రపతి ఎన్నిక విషయంలో కూడా మహిళలకు బీజేపీ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో శాలిభాగ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రేఖాగుప్తాను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, పార్టీ అధ్యక్షులు జేపీ నడ్డా మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి విజయలక్ష్మి, అంబిక, పల్లవి, కవిత, లక్ష్మీ, రెడ్డి ప్రసన్న పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

కడప కల్చరల్: జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ)లో నూతన నియామకాలు చేపట్టాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రఘునాథరెడ్డి మాట్లాడారు. బీమా రంగం రూపు రేకలు మారిపోతున్న దశలో, నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పనిచేయాలంటే ఉన్నత పరిజ్ఞానం ఉన్న యువత అవసరమన్నారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ)కు గుర్తింపు పొందిన సంఘంగా హోదా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, అజీజ్, జగదీష్, తదితరులు ఉద్యోగులకు సంఘీభావం వ్యక్తం చేశారు. చంద్రపాల్, కిరణ్, శంకర్రావు, నిత్యానందరెడ్డి, అక్బర్ బాషా, వసుప్రద, లక్ష్మీ కాంతమ్మ, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇంటింటి న్యాయ ప్రచారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఇంటింటి న్యాయ ప్రచారంలో భాగంగా గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8035 గృహాలను సందర్శించి 84 మంది ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించామని వైద్యసిబ్బంది తెలిపారు. జిల్లాలో 46 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారంతా ఇంటింటా తిరిగి ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తిస్తారన్నారు. తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సిబ్బందిని నియమించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ రంగ బ్యాంకులలో తగినంత సిబ్బందిని నియమించాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి.శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో కోరారు. శుక్రవారం అన్ని జిల్లాల ప్రధాన కార్యాలయాలు, రాష్ట్ర రాజధానులలో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కడప నగరంలోని కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేశామని, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

పంట కాల్వల నిర్వహణ ప్రైవేటుపరం

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం పంట కాల్వల నిర్వహణ ప్రైవేటు పరం చేసి నిర్వహణ ఖర్చు రాబట్టేందుకు ప్రతిపాదనలు చేయడం తగదని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘ అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ కాల్వలు, స్లూయిస్‌ల నిర్వహణ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని కోరడం మంచిది కాదన్నారు. కాల్వల నిర్వహణ ఖర్చుల వసూళ్లకు నీటి మీటర్లు ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రపంచ బ్యాంకు సూచించిందన్నారు. దీని ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం నీటి మీటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడంతో మీటర్లు పగలగొట్టడం జరిగిందన్నారు. కాల్వల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు, గేట్ల నిర్వహణ, సిబ్బంది ఖర్చులు పరిగణలోకి తీసుకొని ఎన్ని కోట్లు ఖర్చవుతుందో లెక్కవేసి రైతులపై భారం మోపేందుకు సిద్ధమవుతున్నారన్నారు. వీటిని పరిశీలించడానికి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు వచ్చారని, రైతుల వ్యతిరేకతతో నాడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం విరమించుకుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఈ ప్రతిపాదనలను ఉపసహరించుకుని రైతుల ప్రయోజనాలను కాపాడాలని, ఎన్నికల హామీలు అమలు చేసేందుకు ప్రయత్నించాలని వారు హితవు పలికారు.

గుంత.. ప్రమాదం చెంత



కడప నగరంలోని ఆల్మాస్‌పేట-టెలికాం నగర్‌కు వెళ్లే రహదారిలోని గుంత ఇది. ఈ మార్గంలో భారీ వాహనాలు వెళ్లడంతో కల్వర్టు దెబ్బతిని ఇలా కంకర లేచి గొయ్యి ఏర్పడింది. రాత్రి పూట గమనించకుండా వేగంగా వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడాల్సిందే. కమిషనర్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్

పేదోడి ఫ్రిజ్.. కుండ



వేసవి రాక ముందే ఎండలు మండుతున్నాయి. పది దాటగానే వేడికి తాళలేక జనం దాహార్తి తీర్చుకునేందుకు పానీయాల కోసం చూస్తున్నారు. ఈ నేపథ్యంలో చల్లని నీటికోసం పెద్దల ఫ్రిజ్ వాడేకన్నా.. పేదల మట్టి కుండే మేలంటున్నారు జనం. కడప నగరంలోని పాలెంపల్లె వద్ద మట్టి కుండలను విక్రయాలకు సిద్ధం చేశారు. నగర వాసులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్న దృశ్యం సాక్షి కెమెరాకు చిక్కింది. – సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



జక్కంపూడి రాజాను సన్మానిస్తున్న దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను యువజన విభాగం వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య గురువారం ఘనంగా సన్మానించారు. విజయవాడలో జరిగిన యువజన విభాగం సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని, రాష్ట్ర అధ్యక్షుడికి శాలువా కప్పి సత్కరించారు. కష్టపడి పనిచేసే వారిని గుర్తుంచుకుంటామని, వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు కృషి చేయాలని జక్కంపూడి రాజా కోరినట్లు ఆదిత్య తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



పూజారి ప్రకాష్ గౌడ్

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీలోని మేథమెటిక్స్ విభాగం పరిశోధకులు పూజారి ప్రకాష్‌గౌడ్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ జి.కాత్యాయిని పర్యవేక్షణలో అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లోని థియోరిటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ వేరియస్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఫ్లోస్ ఓవర్ అన్ ఎక్స్‌పెన్షియల్ స్ట్రెచింగ్ షీట్ విత్ థర్మల్ రేడియేషన్ ఇన్ ఇన్‌వర్సిబిలిటీ అనాలసిస్ అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. దీనిని పరిశీలించిన వైవీయూ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, పీఆర్ సెల్ సంచాలకులు డా.పి.సరిత, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు. పూజారి ప్రకాష్ గౌడ్ ప్రస్తుతం కర్ణాటకలోని భైరవేశ్వర విద్యా సంస్థలో సీనియర్ మ్యాథమెటిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు రుణాలివ్వాలి



వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు రుణాలివ్వాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్‌కుమార్‌కు ఈ మేరకు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రక్రియ మొదలు పెట్టింది గానీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు ఇంకా రుణాలు మంజూరుచేయలేదన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు సతమతమవుతున్నారని, కార్పొరేషన్ల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తే స్వయం ఉపాధికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలి

కడప ఎడ్యుకేషన్: పేదరికం, శారీరక వివక్షత, నిరక్షరాస్యతతోపాటు మత పరమైన విచక్షణ తొలగించడానికి సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ అన్నారు. కడప చెమ్మియాపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా ఫిబ్రవరి 20వతేదీన ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంత, ప్రధానోపాధ్యాయురాలు మేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్: నగర ప్రముఖులు టి.ఉదయభాస్కర్ ముంబయిలోని మహిళా వైద్యురాలి సహకారంతో చిన్నారులకు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తన వంతుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా దుస్తులు పంపిణీ చేశామన్నారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.

పింఛన్ సొమ్ము పెంచాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్సార్టీసీలో పని చేస్తూ 2014కు ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ. 2500 లోపు పెన్షన్ వస్తోందని, కనీసం రూ.5 వేలకు పెంచాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సగినాల శ్రీనివాసులు, రఘునాథరెడ్డి కోరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డిని గురువారం వారు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు పెంచేందుకు హామీ ఇచ్చారన్నారు. శ్రీనివాసులురెడ్డి స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు.